

వారంలో డీఎస్సీ

బీసీ సంక్షేమ శాఖాధికారులతో సమావేశమైన మంత్రి సవిత

కోచింగ్ సెంటర్: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 19: పట్టణంలో వారం రోజుల్లో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభిస్తామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి శుక్రవారం సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. పెనుకొండలో 200 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్ రూ.1500, స్టేషనరీకి రూ.వెయ్యి అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో ఇసుక దోపిడీ సాగిందన్నారు. వెరసి.. గృహనిర్మాణాలు ఆగిపోయాయనీ, దీనిని దృష్టిలో ఉంచుకుని ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు అనువైన చోట రీచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి నిర్మలాజ్యోతి, బీసీ వెల్ఫేర్ సహాయాధికారి గంగాధర్ పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే

జిల్లా అభివృద్ధి

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, జూలై 19: పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏపీఐఐసీ, పరిశ్రమలు, చేనేత జౌళి, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తూ ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్దసంఖ్యలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చేనేత జౌళిశాఖకు సంబంధించి ముద్ర రుణాలు, రాయితీలు, ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారి సోనీ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి చాంద్‌బాషా, చేనేతజౌళి శాఖాధికారి రమేష్, పర్యాటక శాఖాధికారి జయకుమార్ పాల్గొన్నారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్



జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్

పత్తి సాగులో

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

పుట్టపర్తిరూరల్, జూలై 19: జిల్లాలో పత్తి పంట సాగు చేసిన రైతన్నలు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్ తెలిపారు. శుక్రవారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా రైతులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పత్తిసాగులో చీడపీడల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. పత్తివిత్తనాలు నాటిన 20 నుంచి 30 రోజుల తర్వాత గొర్రు, గుంటకతో అంతరకృషి ద్వారా కలుపును నివారించుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రసంపీల్చే పురుగుల ఉధృతికి అవకాశం ఉన్నందున తొలిదశలోనే అదుపు చేయడానికి వేపనూనె 5 ఎంఎల్‌గానీ, 5 శాతం వేపగింజల కషాయాన్ని లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ ఉధృతిని గమనించి పొలంలో పసుపురంగు జిగురు అట్టలను ఎకరాకు 10, త్రిప్స్ ఉధృతిని గమనించడానికి ఎకరాకు 10 నీలంరంగు అట్టలను ఏర్పాటు చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

బిల్లుల కలకలంపై ఉన్నతాధికారులు

సీరియస్

విచారణకు ఆదేశం

హిందూపురం, జూలై 19: మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపులో అక్రమాలపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. మున్సిపల్ ఆర్డీ విచారణకు ఆదేశించారు. పురపాలిక అకౌంట్స్ విభాగంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో మునుపటి కమిషనర్ ప్రమోద్‌కుమార్, జేఏఓపై చైర్‌పర్సన్ ఇంద్రజ.. ఏసీబీకి ఫిర్యాదు చేసిన విషయం వెలుగుచూడడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. సీఎఫ్‌ఎంఎస్ ద్వారా కాకుండా కాంట్రాక్టర్లకు నేరుగా చెక్కులు ఇవ్వడంపై ఆమె ఫిర్యాదు చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లించారనీ, కోట్లాదిరూపాయలు పక్కదారి పట్టాయంటూ చైర్‌పర్సన్ లేఖలో పేర్కొన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తోపాటు అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేసే మనోహర్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ ఉన్నతాధికారులు శుక్రవారం స్పందించారు. వెంటనే విచారణ చేపట్టి, నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. అకౌంట్స్ సెక్షన్‌లో సీఎఫ్‌ఎంఎస్ ద్వారా కాకుండా నేరుగా చెక్కులు ఇవ్వడంతోపాటు ఎక్కడైనా పనులు చేయకనే బిల్లులు మంజూరు చేశారా అనే దానిపై లోతుగా పరిశీలించాలని ఏఓ శోభన్‌రెడ్డిని కమిషనర్ ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం పలు రికార్డులను పరిశీలించారు. నాలుగైదురోజుల్లో దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు కార్యాలయంలో ఉండటంతో విచారణ ఎలా జరుగుతుందోఅన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లు.. ఈ విచారణపై ప్రభావం చూపవచ్చనీ, ఇలాంటి పరిస్థితుల్లో అవినీతి జరిగి ఉండుంటే అది వెలుగులోకి వస్తుందా.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

మంత్రి సత్యకుమార్ చొరవ

పాఠశాల గదుల మరమ్మతులకు చర్యలు



శిథిలావస్థకు చేరిన ముచ్చురామి పాఠశాల గది పైకప్పు


ధర్మవరం రూరల్, జూలై 19: మండలంలోని ముచ్చురామి, వేల్పుమడుగు గ్రామాల్లో పాఠశాలల గదులపై దుస్థితిపై వైదయ శాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లలో నాడు-నేడు కింద పాఠశాల గదుల మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. శుక్రవారం మంత్రి కార్యాలయ సిబ్బంది.. ఆ పాఠశాలలను పరిశీలించారు. వేల్పుమడుగు పాఠశాల గది పరిస్థితి దారుణంగా ఉందనీ, వర్షాకాలంలో కారుతుండటంతో ఉపాధ్యాయులు సొంత నిధులతో టార్పాలిన్ కప్పి, తాత్కాలికంగా నీరు రాకుండా చూస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముచ్చురామి గ్రామంలోని పాఠశాల గది పైకప్పు శిథిలావస్థకు చేరుకుందని మంత్రికి తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే విద్యాశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణం పాఠశాల గదుల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు.

పుట్టపర్తిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

పుట్టపర్తి, జూలై 19: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రహ్మణ్యం శుక్రవారం పట్టణానికి విచ్చేశారు. మాజీ న్యాయమూర్తి బెంగళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1.45కి ప్రశాంతినిలయంలోని శాంతిభవన్‌కు చేరుకున్నారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, సేవాసంస్థల ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు చలం స్వాగతం పలికారు. సాయంత్రం 5 గంటలకు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. రెండురోజులపాటు ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్‌లో మాజీ న్యాయమూర్తి బస చేయనున్నారు.

కాసులిచ్చుకో.. కట్టుకో..!

అనుమతులు అక్కర్లేదు..



కాలేజీరోడ్డులో రెండు అంతస్తులకే అనుమతి ఉన్న భవనం

అనంతపురం రోడ్డులో రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని మూడో ఫ్లోర్ నిర్మాణం

- కదిరిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు
- పాలకుల వసూళ్ల పర్వం
- రూ.కోట్లలో చేతులు మారిన వైనం
- క్రమబద్ధీకరిస్తే రూ.కోట్లలో ఆదాయం

పట్టణ పరిధిలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా మున్సిపాలిటీ అనుమతులు తప్పనిసరి. ఆ తర్వాతే పనులు చేపట్టాలి. మున్సిపల్ పాలకులు, వైసీపీ నాయకులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు గాలికొదిలేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎక్కడ నిర్మాణం చేపడుతున్నా.. అక్కడ వాలిపోయి, వసూళ్లకు తెరలేపారన్న విమర్శలున్నాయి. తమకు కాసులిచ్చుకుంటే.. అనుమతులే అక్కర్లేదనీ, తాముంటామని నిర్మాణదారులకు భరోసా ఇచ్చారు. అలా.. పెద్దఎత్తున పట్టణంలో అనుమతులే తీసుకోకుండా పెద్ద.. పెద్ద భవంతులు కట్టారు. మున్సిపల్ పాలకులు రూ.కోట్లలో వెనకేసుకున్నారు. పురపాలిక ఆదాయానికి గండికొట్టారు. వైసీపీ ఓడిపోయి, కూటమి అధికారం చేపట్టడంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఈ వసూళ్ల పర్వానికి చెక్‌పెట్టి, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చాలని కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు.

- కదిరి

కదిరి పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వంకలు, వాగులు, ఇండస్ట్రియల్ జోన్లు అనే తేడాలేకుండా ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రెండు అంతస్తుల భవంతులకు అనుమతి తీసుకుని, నాలుగు నుంచి ఐదు అంతస్తులు కడుతున్నారు. ఇలాంటివి పట్టణంలో కోకొల్లలు. మున్సిపల్ పాలకుల అవినీతితోనే ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పట్టణంలో 700కిపైగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయంటే వసూళ్ల పర్వం ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. వీటి వెనుక పాలకుల అభయమున్నట్లు సమాచారం. రూ.పదివేలు మొదలుకుని రూ.15లక్షల వరకు మామూళ్లు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. వీటిని క్రమబద్ధీకరిస్తే మున్సిపాలిటీకి రూ.20కోట్లపైగా ఆదాయం వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. గత ఐదేళ్లు రాష్ట్రంలో, మున్సిపాలిటీలో వైసీపీ పాలకవర్గం ఉండడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపూలేకుండా పోయిందన్న వాదనలున్నాయి. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడినట్లు పట్టణవాసులు పేర్కొంటున్నారు.

పాలకులకు కాసుల వర్షం

పట్టణంలో అక్రమ కట్టడాలు మున్సిపల్ పాలకులకు కాసులు కురిపించాయన్న విమర్శలున్నాయి. కొందరు స్థానిక ప్రజాప్రతినిధులకు నిత్యం అక్రమ కట్టడాల నుంచి డబ్బు వరదలా వచ్చిపడుతోంది. ఎవరికి తోచినట్లు వారు వసూళ్లకు పాల్పడుతూనే ఉంటారు. తాము రూ.రెండుకోట్లకుపైగా ఖర్చు పెట్టి ప్రజాప్రతినిధులమయ్యామనీ, దానిని ఇలా వసూలు చేసుకుంటున్నామని కొందరు బాహాటంగానే చెబుతుండడం గమనార్హం. మదనపల్లి రోడ్డులో ఓ భారీ అపార్టుమెంట్ నిర్మాణ దశలో ఉంది. యజమానుల నుంచి దాదాపు రూ.15లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి మున్సిపాలిటీతో ఆ భవన నిర్మాణానికి ఎలాంటి సంబంధమూ లేదు. అహుడా అనుమతులతో నిర్మిస్తున్నారు. అయినా తాము స్థానిక ప్రజాప్రతినిధులమని బెదిరించి, డబ్బు వసూలు చేసినట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. బైపాస్ రోడ్డులోని ఓ భవనానికి మరో ప్రజాప్రతినిధి రూ.5 లక్షలు వసూలు చేసుకుని, అనుమతులు లేకుండా కట్టుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఆధైర్యంతోనే భవన నిర్మాణం చేపడుతున్నారు. కాలేజీ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహ సమీపాన ఓ భవనం రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని, మరో రెండు అంతస్తులు నిర్మించి, మరో ప్రతినిధి రూ.మూడులక్షలు దండుకుని, ఇంకా కావాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇండస్ట్రియల్ జోన్‌లో నిర్మించిన భవన యజమానుల నుంచి మరింతగా వసూలు చేసినట్లు తెలిపారు. ఇండస్ట్రియల్ జోన్ ప్రాంతంలో అనుమతులు రావనీ, అక్రమంగా కట్టుకోండని సలహా ఇచ్చినట్లు తెలిసింది. వంక పోరంబోకు బఫర్ జోన్‌లో ఓ ప్రైవేటు పాఠశాల నుంచి కూడా రూ.5లక్షలు తీసుకుని, నిర్మాణాలు చేసుకోండని చెప్పినట్లు సమాచారం. మొత్తమ్మీద అనుమతిలేని కట్టడాలు మున్సిపల్ పాలకులకు వరంగా మారినట్లు ప్రచారం సాగుతోంది.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

మున్సిపాలిటీలో అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతుందా అని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చర్యలు చేపట్టారు. ఆక్రమణలను కూల్చేసి, భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేస్తున్నారు. అదేక్రమంలో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలకు నోటీసులిచ్చాం

పట్టణంలో నిర్మించిన 743 అక్రమ కట్టడాలకు ఇప్పటికే నోటీసులిచ్చాం. ఎన్నికల గడువు తరువాత వాటిపై చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీ ఆదాయం పెంచుతాం.

- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

క్రమబద్ధీకరిస్తే.. రూ.కోట్లలో ఆదాయం..

పట్టణంలో అక్రమ కట్టడాలు దాదాపు 743 ఉన్నట్లు సమాచారం. వీటిని క్రమబద్ధీకరిస్తే మున్సిపాలిటీకి రూ.20కోట్లకుపైగా ఆదాయం వస్తుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు వీలుగా గత టీడీపీ ప్రభుత్వం బీపీఎస్‌ను ప్రవేశపెట్టింది. తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరేది. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు దానిని అమలు చేయలేదు. దీంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి, డబ్బు దండుకున్నారు. వాస్తవానికి బీపీఎస్ అమలైతే మున్సిపాలిటీకి ఆదాయంతోపాటు భవిష్యత్తులో అక్రమ నిర్మాణాలకు అవకాశం లేకుండాపోతుంది. వీటిని పట్టించుకోకుండా మున్సిపల్ పాలకులు వసూళ్లకు పాల్పడ్డారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.

కొండను కొల్లగొట్టారు..!



రేగాటిపల్లి సమీపాన తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోయిన కొండ

- రేగాటిపల్లి కొండలో తవ్వకాలు
- రెండేళ్లుగా మట్టిమాఫియా దందా
- కరిగిపోతున్న ప్రకృతి సంపద
- పట్టించుకోని అధికారులు

ధర్మవరం రూరల్, జూలై 19: గత వైసీపీ పాలనలో మట్టి దందా రూ.కోట్లలో సాగిందన్నది బహిరంగ రహస్యమే. మట్టి బకాసురుల అక్రమార్జనకు కొండగుట్టలు సైతం కరిగిపోయాయి. రెండేళ్లుగా యథేచ్ఛగా మట్టిదోపిడీకి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్స్‌కవేటర్లతో కొండగుట్టల్లోని చెట్లు, పెద్దపెద్ద బండరాళ్లను పెకలించేసి, మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ మట్టిని వెంచర్లకు తరలిస్తున్నారు. ఇలా.. ధర్మవరం మండలంలోని రేగాటిపల్లి కొండను కరిగించారు. ఇక్కడి నుంచి మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండటంతో కొండంతా కరిగిపోతోంది. మట్టిని తరలిస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. దర్జాగా మట్టిని తరలిస్తున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

ప్రకృతి సంపద కనుమరుగు..

కొండలు, గుట్టల్లోని మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండటంతో ప్రకృతి సంపద కనుమరుగవుతోంది. మండలంలోని రేగాటిపల్లి, పోతులనాగేపల్లి, పోతుకుంట లక్ష్మీనరసింహస్వామి గుట్ట, పోతుకుంట చెరువులోని మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రేగాటిపల్లి కొండలోని చెట్లను పెకలించి, మట్టిని తరలిస్తున్నారు. పోతుకుంటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి గుట్టను తవ్వి, మట్టిని ట్రాక్టర్లతో పట్టణంలోకి తరలిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

ట్రాక్టర్ మట్టి రూ.2 వేలు

రేగాటిపల్లి కొండ నుంచి ఒక్కో ట్రాక్టర్ మట్టి ధర రూ.2వేల వరకు, టిప్పర్ రూ.8వేల వరకు పలుకుతోంది. ధర్మవరం పరిసర గ్రామాల కొండగుట్టల్లో మట్టిదందా రెండేళ్లుగా సాగుతోంది. అడిగేవారెవ్వరన్న రీతిలో విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా.. రూ.కోట్లలో జేబులు నింపుకున్నట్లు తెలుస్తోంది.



అనుమతులు ఇవ్వలేదు

మండలంలో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా మట్టి తరలిస్తుంటే అడ్డుకుంటాం. చర్యలు తీసుకుంటాం.

- ఎంఏ రమేష్, తహసీల్దార్, ధర్మవరం





కరిగిపోయిన రేగాటిపల్లి కొండ, బయటపడ్డ బండరాళ్లు



ట్రాక్టరుతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

అభివృద్ధి ఏదీ ?

ఆదాయంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు లేదు?
నేమకల్లు అంజన్న ఆలయ అధికారులను నిలదీసిన గ్రామస్థులు
హైడ్రామా మధ్య టెంకాయల అమ్మకం వేలం వాయిదా

బొమ్మనహాళ్, జూలై 19: ఆదాయాన్ని తీసుకెళ్తున్నారు గానీ ఆలయాన్ని అభివృద్ధి చేయడం లేదని గ్రామస్థులు దేవదాయ అధికారులను నిలదీసిన సంఘటన మండలంలోని నేమకల్లులో జరిగింది. ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం టెంకాయల అమ్మకం వేలం పాట నిర్వహించాలని ప్రయత్నించారు. ప్రారంభంలోనే దేవాలయ నిధులలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దేవాలయానికి ఏడాదికి రూ. 50 లక్షలకుపైగా ఆదాయం ఉందని, ఎందుకు అభివృద్ధి చేయడం లేదని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ప్రతి ఏటా హుండీ, టెంకాయలు, లడ్డూ, రూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని తీసుకెళ్లడమే గాని ఆలయ అభివృద్ధికి ఏం చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు. కొన్నేళ్లుగా మరుగుదొడ్లు, బాత్రూంలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఉన్న గుమాస్తా సమస్యల గురించి తనకు చెప్పలేదన్నారు. దీంతో డబ్బులిస్తేనే కదా పనులు చేయించేది అని గుమాస్తా ఓబన్న బదులిచ్చాడు. ఈక్రమంలో రాయదుర్గం జూనియర్ అసిస్టెంట్ జితేంద్ర, ఓబన్నల మధ్య వాగ్వాదం జరిగింది. గుమాస్తా ఓబన్న దేవాలయ సమస్యలపై పట్టించుకోవడం లేదని, ఆలయంలో రెండేళ్ల కిందట బియ్యం చోరీ అయినా పట్టించుకోలేదని, దేవాలయ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన్ను తొలగించాలని కొందరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఎవరు ఎంతెంత సొమ్ము తిన్నారో? లెక్కలు బయట పెడతానని ఓబన్న అనడంతో కొందరు జోక్యం చేసుకుని కప్పిపుచ్చారు. అధికారుల హైడ్రామా మధ్య టెంకాయలు అమ్మకం వేలం పాట నిర్వహించారు. గత ఏడాది రూ. 6.20 లక్షలకు పాడగా ఈ ఏడాది రూ. 4.80 లక్షలకే పాట పాడటంతో వేలం వాయిదా వేశారు. కాగా ఆలయానికి ఎదురుగా ఉన్న 10 గదుల్లో 8 గదులు వేలం పాట నిర్వహించారు. ఇందులో రెండు వాయిదా పడినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఎనిమిది గదులకు రూ. 20 వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గదులకు డిమాండ్ లేకపోవడంతో తూతూ మంత్రంగా జరిపి మమ అనిపించారు.



దేవాలయ సమస్యలపై నిలదీస్తున్న గ్రామస్థులు

24 నుంచి మున్సిపల్ వర్కర్ల రాష్ట్ర సదస్సులు

అనంతపురం విద్య, జూలై 19: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వైజ్ఞానిక శిక్షణా సదస్సులు ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ మదనపల్లి సమీపంలోని హార్సిలీ హిల్స్‌లో ఈ సదస్సులు ఉంటాయన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు జరపాలన్నారు. పోయిన సమ్మె కాలంలో చేసిన డిమాండ్ల ఇప్పటికీ నెరవేరలేదన్నారు. మున్సిపాలిటీల్లో ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవ్స్ బకాయి ఉన్న డీఏలు వెంటనే ఇవ్వాలని కోరారు. మున్సిపల్ స్కూళ్లలో పనిచేసే స్వీపర్లు, వాచ్‌మెన్లకు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేష్ గౌడ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఇతర నాయకులు వేణు, కొండయ్య, నాగేంద్రబాబు, నాగరాజు, కుళ్లాయి రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అధికారులదే బాధ్యత

- గ్యాంగ్ ఉద్యోగి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి
- ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్

గుంతకల్లు, జూలై 19: వేధింపులకు పాల్పడి గ్యాంగ్‌మన్ హరి ఓం నారాయణ్ మృతికి కారణమైన రైల్వే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. హరి ఓం నారాయణ్ అనే బిహార్‌కు చెందిన గ్యాంగ్ ఉద్యోగి ఉన్నతాధికారుల వేధింపుల తాళలేక ఈ నెల 15న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ అతడి వద్ద ధ్రువీకరణ పత్రాలేవీ లభించనందున గుర్తుతెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసును నమోదుచేశారు. నాలుగు రోజుల కిందట గ్యాంగ్ ఉద్యోగి హరి ఓం నారాయణ్ అదృశ్యం కావడంపై అతడి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రైలు కిందపడి మరణించిన వ్యక్తి ఫొటోలను చూసి అతడు హరి ఓం నారాయణ్‌గా సహోద్యోగులు గుర్తుపట్టారు. హరి ఓం ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం సీనియర్ సెక్షన్ ఇంజనీరు పీ-వే (బ్రాడ్‌గేజ్) కార్యాలయం ఎదుట ఈ విభాగానికి చెందిన గ్యాంగ్ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం వద్దకు వచ్చి ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు మద్దతునిచ్చిన సంఘ్ డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ పీ-వే (బీ.జీ.) విభాగంలోని సీనియర్ సెక్షన్ ఇంజనీర్లయిన సంతోష్ కుమార్, శశికుమార్ యాదవ్ గ్యాంగ్ సిబ్బందిని వేధిస్తున్నారని, వారి వేధింపుల వల్లే గ్యాంగ్‌మన్ హరి ఓం బలవన్మరణానికి ఒడిగట్టాడని ఆరోపించారు. వారిద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ ఎస్అండ్‌టీ/ఇంజనీరింగ్ విభాగం యూనియన్ కార్యదర్శి డీ రాజ్ కుమార్, గ్యాంగ్‌మెన్, తదితరులు పాల్గొన్నారు.



గ్యాంగ్‌మెన్ ధర్నాలో మాట్లాడుతున్న సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్

అప్పులబాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



నీరుగుట్ట నారాయణస్వామి (ఫైల్)

ధర్మవరం, జూలై 19: అప్పుల బాధతో పట్టణంలోని శివానగర్‌లో ఓ చేనేత కార్మికుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. శివానగర్‌కు చెందిన నీరుగుట్ట నారాయణస్వామి(43) రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్‌కుమార్, కుమార్తె ప్రణతి ఉన్నారు. కొన్నేళ్ల కిందటి వరకూ బాగున్న చేనేత పరిశ్రమ కరోనా తరువాత కుదేలవుతూ వచ్చింది. దీనికి తోడు ముడిసరుకుల ధరలు రెట్టింపు కావడం, నేసిన చీరలకు గిట్టుబాటు లేకపోవడంతో కుటుంబపోషణ భారమైంది. ముడిసరుకులు, పిల్లల చదువులు, కుటుంబపోషణ కోసం దాదాపు రూ.ఆరు లక్షల దాకా అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో తోచక తరచూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. మొహరం పండుగ కోసం తన పుట్టిళ్లు అయిన ముదిగుబ్బ మండలం సీసీరేవుగ్రామానికి పిల్లలను తీసుకుని భార్య వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. ఉదయం కుమారుడు అనిల్‌కుమార్ సీసీరేవు గ్రామం నుంచి ధర్మవరం వచ్చాడు. ఇంటి తలుపులు తెరవగానే తండ్రి ఉరికి వేలాడుతూ కనిపించడంతో బోరున విలపించడంతో పక్కనే ఉన్న మృతుడి అన్న, బంధువులు అక్కడికి వచ్చారు. ఉరికి వేలాడుతున్న నారాయణస్వామిని కిందకు దించారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించి, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19: జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు కుషాల్, శ్రీహ అర్హత సాధించారు. నంద్యాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ రాష్ట్ర జూనియర్ అండర్-19, ఓపెన్ బాలికల చెస్ చాంపియన్‌షిప్-2024పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అండర్-19 ఓపెన్ విభాగంలో మొత్తం 151మంది క్రీడాకారులు పాల్గొనగా జిల్లాకు చెందిన కుషాల్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. బాలికల విభాగంలో శ్రీహ తృతీయ స్థానం సాధించింది. ఇద్దరు క్రీడాకారులు సెప్టెంబరులో నిర్వహించే జాతీయ స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించారని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్‌కుమార్ నాయుడు, గౌరవాధ్యక్షుడు బాలరాజులు అభినందనలు తెలిపారు.

రైళ్ల దారి మళ్లింపు



గుంతకల్లు, జూలై 19: అనంతపురం-గుంతకల్లు మీదుగా వెళ్లే రెండు రైళ్లను దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోకమాన్య తిలక్ టెర్మినస్ (ముంబై) - కోయంబత్తూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (నెం. 11013) రైలును ఈ నెల 29న, ఆగస్టు 5, 12 తేదీల్లో బెంగళూరు ఈస్ట్, బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ల మీదుగా కాకుండా గౌరీబిదనూరు, బయ్యపనహళ్లి, హోసూరు స్టేషన్ల మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే కేఎస్ఆర్ బెంగళూరు-నాందేడ్ డెయిలీ ఎక్స్‌ప్రెస్ (నెం. 16593)ను ఈ నెల 30, ఆగస్టు 6, 13 తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ మీదుగా కాకుండా, బెంగళూరు యశ్వంతపూర్, యలహంక స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ రైలు రాత్రి 11-20 గంటలకు కాకుండా, అర్ధరాత్రి 12-45 గంటలకు బయల్దేరుతుందన్నారు. అదేవిధంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్-కేఎస్ఆర్ బెంగళూరు మధ్యన నడిచే ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ (నెం. 11301) రైలును ఈనెల 30, ఆగస్టు 6, 13 తేదీల్లో ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు.

నీటి పంపింగ్‌కు చర్యలు చేపట్టండి: కేశవ్

ఉరవకొండ, జూలై 19: నియోజకవర్గంలోని ఎస్ఎస్ ట్యాంక్‌ల్లోకి నీటిని పంపింగ్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. విజయవాడ నుంచి ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎస్ఎస్ ట్యాంక్‌లు ఎండిపోయాయని, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు తెలిపారు. హెచ్చెల్సీకి నీరు విడుదల కానున్న నేపథ్యంలో నింబగల్లు, విడపనకల్లు, గడేకల్లు, కొనకొండ్ల గ్రామాల వద్దనున్న ఎస్ఎస్ ట్యాంకులను నింపాలని సూచించారు. ఆ దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ ట్యాంకులపై ఆధారపడిన గ్రామాలకు వెంటనే తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. నీటి పంపింగ్ తాను స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రికి కలెక్టర్ తెలిపారు.

హెచ్చెల్సీపై అధికారుల పర్యటన

కణేకల్లు, జూలై 19: తుంగభద్ర ఎగువ కాలువను కర్ణాటక, ఆంధ్ర అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. కర్ణాటకలోని 23వ కి.మీ. నుంచి ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ. వరకు కాలువ పరిస్థితిని వారు శుక్రవారం పరిశీలించారు. తుంగభద్ర డ్యాం కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర, ఎస్‌డీఓలు నందాని, గోపీతో పాటు ఆంధ్ర హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ వెంకట్రామిరెడ్డి కాలువ లైనింగ్, ఎస్కేప్ చానళ్ల పరిస్థితి, అండర్ టన్నెల్, రివిట్‌మెంట్ తదితరాలను పరిశీలించారు. ఈ నెల 22న హెచ్చెల్సీకి నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో కాలువల పరిస్థితిని పరిశీలించారు. జిల్లాలో హెచ్చెల్సీ నీటిని తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం కింద వినియోగిస్తామని అధికారులు తెలిపారు. ఆగస్టులో ఐఏబీ సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని అన్నారు. కాగా టీబీ డ్యాంకు శుక్రవారం లక్ష క్యూసెక్కులకు పైగా వరద నమోదైంది.

దారి తప్పిన నిధులు

- గ్రామీణ రోడ్ల అభివృద్ధి నిధులు పక్కదారి
- ఐదేళ్లలో 25 శాతం పనులు చేయని వైసీపీ
- బ్యాంకు లోన్ నిధులు సైతం మళ్లింపు
- రాష్ట్ర వాటాను ఇవ్వని గత ప్రభుత్వం
- అధ్వానరోడ్లపై గ్రామీణ ప్రజల అవస్థలు

అనంతపురం సిటీ, జూలై 19: గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారులను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అవి ఛిద్రమయ్యాయి. దీంతో పల్లె ప్రజలు ప్రయాణానికి ఎన్నో అవస్థలు పడ్డారు. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన నిధులను సైతం జగన్ సర్కార్ పక్కదారి పట్టించింది. అధికారిక లెక్కల ప్రకారం గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల పనులను కనీసం 25శాతం కూడా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు కూడా రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. దీంతో వారు బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్నారు.



జిల్లా పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయం

ఐదేళ్లలో చేసిందీ.. 25శాతమే

గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం అధికార లెక్కల ప్రకారం 2018-19లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులు మంజూరు చేసింది. 138 గ్రామీణ రోడ్లను రూ.268 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంది. కాగా ఈ రోడ్లకు 70:30 వాటాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధు లు సమకూర్చాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ద్వారా రుణం కింద తన వాటా నిధులను మంజూరు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 30శాతం నిధులు ఇవ్వకపోగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం ఇతర ప్రభుత్వం పథకాలకు మళ్లించింది. దీంతో అభివృద్ధి లేక గ్రామీణ రోడ్లు మరింత దయనీయస్థితికి చేరాయి. గత ఐదేళ్లలో 138 రోడ్లలో 34 రోడ్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 104 రోడ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారినట్లైంది. వీటిలో కొన్ని మధ్యలోనే ఆగిపోగా, మరిన్ని అసలు ప్రారంభమే కాలేదు. కనీసం కేంద్రం ఇచ్చిన నిధులతో నైనా వీలైనంత వరకు గ్రామీణ రోడ్లను నిర్మించి ఉంటే గత ఐదేళ్లలో కొంతైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టర్లకు సైతం చెల్లించాల్సిన బిల్లులు అధికార లెక్కల ప్రకారం రూ. 23.66 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

జిల్లాలో గ్రామీణ రోడ్ల పనుల దుస్థితి ఇలా..

- మంజూరైన రోడ్లు : 138
- నిధుల వ్యయం : రూ. 268 కోట్లు
- గత ఐదేళ్లలో ఖర్చు చేసింది : రూ. 92.95 కోట్లు
- పెండింగ్ బిల్లులు : రూ. 23.66 కోట్లు
- ఇంకా ఖర్చు చేయాల్సింది : రూ. 175.05 కోట్లు
- పూర్తయిన రోడ్లు : 34
- మధ్యలో ఆగిపోయిన రోడ్లు : 39
- ప్రారంభమేకాని రోడ్లు : 65

ప్రజలకు తప్పని అవస్థలు

గత ప్రభుత్వ వైఖరితో జిల్లాలో గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. ఆయా రహదారులపై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. ప్రధానంగా ఉరవకొండ, రాయదుర్గం, రాప్తాడు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో ఇకనైన గ్రామీణ రోడ్ల దశమారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు



జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో పీఐయూ కింద పనులు ఆశించిన స్థాయిలో జరగలేదన్నది వాస్తవమే. రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట కూడా నిజమే. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేయలేదు. కొన్ని రోడ్లకైతే టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురాలేదు. కొత్త ప్రభుత్వానికి సమస్యలు, రోడ్లకు సంబంధించిన సమగ్ర నివేదికను అందజేశాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులను వేగవంతం చేస్తాం.

\- కేవీకేవీ ప్రసాద్, పీఆర్ ఎస్ఈ.

మేడం..! మా బిడ్డను వెతికించండి

మంత్రి సవితకు బాధితుల మొర

పెనుకొండ టౌన్, జూలై 19: తమ కుమార్తె షాఫియా(5) కనిపించకుండా పోయి ఏడాది గడచినా ఆచూకీ లభించలేదని, మీరే వెతికించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు బాధితులైన ఖలీల్, రేష్మా దంపతులు మొరపెట్టుకున్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం మంత్రిని కలిసిన వారు తమ గోడు వెల్లబోసుకున్నారు. గత వైసీపీ పాలనలో పలుమార్లు పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదని కన్నీటిపర్యంతమయ్యారు. మంత్రి బాధితులను ఓదార్చుతూ గతంలో చిన్నారి ఆచూకీ కోసం మీడియా ద్వారా గట్టిగా పోరాడామన్నారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ వేగవంతం చేయిస్తానని హామీ ఇచ్చారు. పెనుకొండ దర్గాపేటలో నివాసముంటున్న ఖలీల్, రేష్మా దంపతుల కుమార్తె షాఫియా గత ఏడాది జూన్ 12న ఇంటి బయట ఆడుకుంటుండగా తండ్రి మందలించి ఇంటివద్ద వదిలి వ్యాపారానికి వెళ్లాడు. తర్వాత కొద్దిసేపటికి ఇంటికి వచ్చి చూడగా షాఫియా కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించారు. చివరకు పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గుల్బర్గా, తదితర దర్గాలలో ప్రత్యేక బృందాలు గాలించాయి. ప్రయోజనం లేకపోయింది. ఈక్రమంలో కనీసం టీడీపీ ప్రభుత్వంలోనైన బాధ్యతగా తమ బిడ్డను వెదికిపెడతారేమోనన్న ఆశతో బాధితులు మంత్రి సవిత వద్దకు వచ్చారు.



బాధితులను ఓదార్చుతున్న మంత్రి సవిత



తప్పిపోయిన చిన్నారి షాఫియా (ఫైల్)

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, జూలై 19: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 628 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.60

అనంతపురం రూరల్, జూలై 19: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.60తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.53, కనిష్ఠ ధర రూ.40 పలికినట్లు ఆయన తెలిపారు.

అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19: జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. గత మూడు రోజుల పాటు బెంగళూరులో నిర్వహించిన 13వ జాతీయ జూనియర్-సబ్‌జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. లాంగ్‌జంప్‌లో నరేష్ బంగారు పతకం సాధించాడు. షాట్‌పుట్‌లో సుదర్శన్ రజతం, భార్గవకుమార్ కాంస్య పతకాలు సాధించారు. విజేతలను విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, సమగ్రశిక్షణ కోఆర్డినేటర్ షమా, డీఎస్ఏ చీఫ్‌కోచ్ షఫీ అభినందించారు. ఈ కార్యక్రమంలో శాప్‌కోచ్ మంజుళ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 వరకు డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, జూలై 19: డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును 25వరకు ప్రభుత్వం పొడిగించింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 29వరకు వెబ్ ఆప్షన్ ద్వారా నచ్చిన కళాశాల, కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. ఆగస్టు 3న సీట్లను కేటాయించి 5నుంచి తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

తొమ్మిది మందిపై రౌడీషీట్

హిందూపురం, జూలై 19: పట్టణానికి చెందిన కార్తీక్‌పై దాడి చేసిన కేసుకు సంబంధించి వైసీపీ జిల్లా యువజన అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌తోపాటు తొమ్మిది మందిపై రౌడీషీట్ నమోదు చేసినట్లు డీఎస్పీ కంజక్షన్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న రాత్రి పట్టణంలోని వీడీరోడ్డులో కార్తీక్ ఉండగా దాడిచేశారు. అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న షేక్ మహ్మద్ ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేశారు. దీంతో హర్షం వ్యక్తం చేస్తూ కార్తీక్ టపాసులు పేల్చాడు. అయితే ఇక్బాల్‌కు మద్దతు పలుకుతావా అంటూ వైసీపీ జిల్లా యువజన అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌తోపాటు అమర్నాథ్‌రెడ్డి, హోటల్ సుధీర్, సాయికిరణ్‌గౌడ్, శెక్షా, హరేంద్రనాథ్, మధుసూదన్, భాస్కర్, తిరుమలేష్‌పై కేసు నమోదుచేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో దీన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా పరిగణించింది. వెంటనే కేసు నమోదుచేసి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో మేలోనే తొమ్మిది మందిపై రౌడీషీట్ తెరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కానీ కొంతమంది వైసీపీ నాయకులు నిన్న మొన్న రౌడీషీటు ఓపెన్ చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల కమిషన్ ఆదేశల మేరకు జరిగిందన్నారు. ఇదిలా ఉంటే చిలమత్తూరు మండలంలో వైసీపీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి పోలింగ్ రోజున పలుచోట్ల వీరంగం సృష్టించాడు. అయినా అతనిపై రౌడీషీట్ ఎందుకు ఓపెన్ చేయలేదని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

తుంగభద్రకు పోటెత్తుతున్న వరద

బొమ్మనహాళ్, జూలై 19: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్రకు వరదనీరు పోటెత్తుతోంది. ఈక్రమంలోనే గురువారం 1,04,060 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం ఉదయానికి 1,08,790 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో నీటి నిల్వ 55.972 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, అగుంబె, శృంగేరి, చిక్‌మంగళూరు, వరనాడులలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది.



టీబీ డ్యాంలో చేరుతున్న వరదనీరు

విద్యుత్ శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్



అనంతపురంరూరల్, జూలై 19: ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈగా సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఆమేరకు శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో అనంతపురం ట్రాన్స్‌ఫార్మర్స్, ఆపరేషన్ విభాగాల్లో పని చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈయనను తెలంగాణకు కేటాయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఏపీఎస్పీడీసీఎల్‌కు కేటాయించబడ్డారు. ప్రస్తుతం తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సురేంద్రను తిరుపతి ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

రానున్న ఐదు రోజుల్లో వర్ష సూచన

వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, జూలై19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములుతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు.

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



నిమ్మకాయల అలంకరణలో పెద్దమ్మ

ధర్మవరం, జూలై 19: పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మదేవతకు ఆషాఢమాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు వెంకటేశ్‌శర్మ అమ్మవారికి వివిధ అభిషేకాలు చేసి పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. వేయి నిమ్మకాయల హారాలు వేసి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

ధర్మవరం, జూలై 19: పట్టణంలోని పుట్టపర్తి రహదారి పక్కన ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 5గంటలకు కాకడహారతి, 6కు అభిషేకం, 8గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం జరుగుతాయన్నారు. అలాగే ఉదయం 8-30గంటల నుంచి రాత్రి 10 వరకు బాబ ఆ పాదర్శనం కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 11 నుంచి అన్నసంతర్పణ చేపడుతామన్నారు. మరుసటి రోజు సోమవారం 22న 9గంటలకు లక్ష కుసుమార్చన జరుగుతుందనని, భక్తులు తరలిరావాలని కోరారు.

అన్నదానం

ధర్మవరం, జూలై 19: మొహరం ఉత్సవాలు ముగింపు అనంతరం రైల్వేస్టేషన్ సర్కిల్‌లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉత్సవాల ముగింపు మరుసటి రోజు నిర్వాహకులు బిల్లే శీనయ్య, మాబు, మాబ్‌బాషా, చంద్ర, హుస్సేన్, సుభహాన్ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భవితకేంద్రం విద్యార్థులకు సామగ్రి అందజేత

ధర్మవరం, జూలై 19: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న భవిత కేంద్రంలోని విద్యార్థులకు సామగ్రిని శుక్రవారం ఆర్డీఓ వెంకటరామిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. కేంద్రంలోని 25 మంది విద్యార్థులకు పలకలు, బాక్స్‌లు, గ్లాసులను ఆర్డీఓతోపాటు ఎంఈఓ-1 రాజేశ్వరి అందజేశారు. భవిత కేంద్ర విద్యార్థులు బాగా చదువుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరస్వతి, మల్లికార్జున, టీడీపీ నాయకులు నాగరాజు, హరి, బాలకృష్ణ, నాగేంద్ర, మురళి, షఫీ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సుపాసుల పంపిణీ



విద్యార్థులకు బస్సు పాసులు అందిస్తున్న దృశ్యం

గాండ్లపెంట, జూలై 19: మండలంలోని మల్లమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్సు పాసులను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు హైదర్‌వలి అందించారు. మల్లమీదపల్లి పాఠశాలలో మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న కాట్నేపల్లి, రాసినేపల్లి గ్రామాల 25మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు చొరవచూపి బస్సు పాసులను తీసుకొచ్చి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యాసాగర్, శ్రీనివాసులు, సూర్యశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రావు తదితరులున్నారు.

విద్యాసామగ్రి వితరణ

గాండ్లపెంట, జూలై 19: మండలంలోని చామలగొంది పంచాయతీ రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి రెడ్డిప్రసాద్ విద్యాసామాగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. అంగన్ వాడీ, ప్రాథమిక విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సరస్వతి, సోమావతి, లక్ష్మీదేవి విద్యార్థులున్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

నల్లచెరువు/నల్లమాడ, జూలై 19: నల్లచెరువు మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో టీడీపీ సీనియర్‌నాయకుడు కౌలేపల్లి రామస్వామి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ తరపున అండగా ఉంటామన్నారు. నాయకులు రమణారెడ్డి, దేవేంద్ర, సతీష్, కరుణాకర్, నాగిరెడ్డి, గంగిశెట్టి, యల్లప్ప, రాజ్‌కుమార్, సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు. అలాగే నల్లమాడ మండలకేంద్రానికి చెందిన నారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఆయన ఇంటికెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు.

తండ్రిపై తనయుడి దాడి



గాయడిన లింగప్ప

ఓబుళదేవరచెరువు, జూలై 19: ఆస్తి విషయంలో మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తిపై అతడి కుమారుడు దాడి చేసినట్లు ఏఎస్‌ఐ రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలకేంద్రంలోని పాత మసీదు వీధి లో ఉంటున్న కలిమి లింగప్పకు ఇద్దరు భార్యలు. పశువుల మేతకోసమని లింగప్ప గురువారం సాయంత్రం చెరువు కట్ట సమీపంలో తోటవద్దకు వెళ్లాడు. ఆ సమయంలో రెండో భార్య కుమారుడు మల్లికార్జున ఆస్తి విషయంపై తండ్రిని నిలదీశాడు. అయితే కోర్టులో ఉండడంతో సమయం పడుతుం దని తండ్రి సమాధానమిచ్చాడు. దీంతో ఆవేశానికి గురైన కొడుకు దాడి చేయడంతో లింగప్పకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. లింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు మాత్రం లింగప్పపై మల్లికార్జున హత్యాయత్నం చేశాడని అంటున్నారు.

వంకలోకి వ్యాన్..



వంకలోకి దూసుకెళ్లిన వ్యాన్

ముదిగుబ్బ, జూలై 19: మండలంలోని నాగులగుబ్బల గ్రామ సమీపంలో వ్యాన్ అదుపుతప్పి వంకలోకి దూసుకెళ్లింది. ముదిగుబ్బ వైపు నుంచి పులివెందుల వైపు వెళుతున్న వాహనం అదుపు తప్పి 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, వంకలోకి దూసుకెళ్లిందని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పశువులకు టీకాలను వేగవంతం చేయండి

ఓబుళదేవరచెరువు, జూలై 19: పశువులకు ముద్దచర్మవ్యాధి నివారణ చర్యల కింద వేసా టీకాలను వేగవంతం పూర్తి చేయాలని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యప్రకాష్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని కొండకమర్లలో పశువైద్య సిబ్బంది ముద్దచర్మ వ్యాధి నివారణ టీకా కార్యక్రమంపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ముద్దచర్మ వ్యాధి నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈవ్యాధి సోకిన పశువులు తిండి తినకపోవడం, వాటి శరీరంపై బొబ్బలు, జ్వరం రావడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి నివారణ యజమానులు పశువులకు టీకాలు వేయించాలన్నారు. పశు బీమాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారి ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలి

- సిబ్బందికి ఎమ్మెల్యే సింధూరారెడ్డి సూచన



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి, జూలై 19 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు వరమనీ, పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సిబ్బందికి సూచించారు. ఆమె శుక్రవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పే దలకు ఎక్కువ పనిదినాలు చూపి పారదర్శకంగా పనులను నిర్వ హిం చాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఉపయోగపడేవిదంగా శాశ్వ త అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పది ఎకరాలున్న రైతులు సైతం డ్రైల్యాండ్ హార్టికల్చర్ పంటలు సాగుచేసుకోవడానికి అను మతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జబాబుదారీ తనం లేక ఉపాధి నిధులు దు ర్వినియోగం అయ్యాయని, కూటమి ప్రభుత్వంలో అలాకాకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వర్షాల సీజన్లో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, నీటికాలువల పనులు, చెట్ల పంపకం చేప ట్టాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు



పీర్లను జలధికి తీసుకెళ్తున్న గ్రామస్థులు

ధర్మవరం రూరల్, జూలై 19: మొహరం వేడుకల్లో భాగంగా మండలపరిధిలోని గొట్లూరులో శుక్రవారం పీర్లను జలధికి తీసుకెళ్లారు. పీర్లను లంకరించి ముల్లాసాబ్ ప్రత్యేకప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి ఇంటింటికీ పీర్లను తీసుకెళ్లగా గ్రామస్థులు చక్కెర, బెల్లం చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, బంధువులతో పీర్లమకాన్ ప్రాంగణం కిటకిటలాడింది. రూరల్ ఎస్‌ఐ నరేంద్ర పోలీసు బందోబస్తు నిర్వహించారు.

భూసమస్యలు వెంటనే పరిష్కరించండి

మండల రెవెన్యూ అధికారులకు ఆర్డీఓ సూచన

తనకల్లు, జూలై 19: మండలంలో రైతులు మధ్య నెలకున్న భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ వంశీకృష్ణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీ సదుం, మార్పురివాండ్లపల్లి, తొట్లిపల్లి గ్రామాల్లో రైతుల మధ్య నెలకున్న భూ వివాదాలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈవిషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. బాల్యవివాహాలు అరికట్టడంలో అధికారులందరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు వెంటనే చేపట్టాలి

ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్



సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ముదిగుబ్బ, జూలై 19: జిల్లాలో అనేక పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ అన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ముదిగుబ్బ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకొని ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో నెంబరు 117ను వెంటనే రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నాగేంద్ర, కళ్యాయప్ప, షబ్బీర్ భాషా, ఆంజనేయులు, కుమార్, సుంకన్న, పీరూ నాయక్, మదన్మోహన్, చంద్రశేఖర్, నరేష్, రమేష్‌నాయుడు, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో విభాగాల పరిశీలన



సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 19: డీపీఓ కార్యాలయంలోని విభాగాలను జిల్లా ఎస్పీ రత్న శుక్రవారం రాత్రి పరిశీలించారు. సెక్షన్ ఆఫీసులో ఎవరెవరు ఎటువంటి విధులు నిర్వర్తిస్తున్నారు? ఎంతమంది సిబ్బంది ఉన్నారు? వారి విధులను గురించి కార్యాలయ ఏఓ సుజాతతో ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కదిరి విద్యార్థులు

కదిరిఅర్బన్, జూలై 19: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పట్టణంలోని హరీష్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. కదిరిలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపికలో తమ పాఠశాల విద్యార్థులు చరణ్‌కుమార్‌రెడ్డి, హిందు, జాహ్నవి, దేవిక, శాలిని, శైలజ ఎంపికైనట్లు తెలిపారు. ఆగస్టు 16, 17 వ తేదీల్లో కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. వారిని పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే



ఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, జూలై 19: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి రత్నను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే, మాజీమంత్రితో పాటు టీడీపీ అర్బన్ కన్వీనర్ రామాంజినేయులు, పుడా మాజీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, మునిసిపల్ మాజీ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్త చలపతి, రాష్ట్ర మైనారిటీ విభాగపు కార్యదర్శి షేక్ మహమ్మద్‌రఫీ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్, టీడీపీ నాయకులు తిరుపాల్ ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు. అంతకుమునుపు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ విష్ణు ఎమ్మెల్యే సింధూరారెడ్డిని ఆమె క్యాంపు కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పుట్టపర్తి నాయకులు



మంత్రికి బాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, జూలై 19: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ పుట్టపర్తి నాయకులు మంగళగిరిలో కలిశారు. మంత్రిని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసినట్లు కౌన్సిలర్ రత్నప్పచౌదరి, నాయకులు ఊరువాకిలి సురేష్, వెంకటరాముడు, అవుల సుబ్రహ్మణ్యం, తదితరులు తెలిపారు. ఆయనను దుశ్శాలువతో సన్మానించి బాబా చిత్రపటాన్ని అందచేశామన్నారు. అలాగే అంతర్జాతీయంగా పేరుగాంచిన పుట్టపర్తి అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని, సత్యసాయి బాబా మహాసమాధి దర్శనానికి రావాలని కోరామని తెలిపారు.

ఆరోగ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

జేసీకి సచివాలయ ఉద్యోగుల వినతి

పుట్టపర్తి, జూలై 19: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని వైద్యఆరోగ్యసిబ్బంది శుక్రవారం జేసీ అభిషేక్‌కుమార్‌కు విన్నవించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనేయులు ఆధ్వర్యంలో వారు శుక్రవారం కలెక్టరేట్‌కు వెళ్లి జేసీకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం తమకు బయోమెట్రిక్ మినహాయింపు ఇవ్వాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఇతరసిబ్బంది తరహాలో సాధారణ సెలవులు, రెండో శనివారం సెలవు వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది యూనియన్ నాయకురాళ్లు పరిమిళ, రామాంజినమ్మ, అమృత, సుహాసిని, జ్యోతి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి అవార్డు

కదిరి అర్బన్, జూలై 19: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ వేముల వీరాస్వామికి ఐకాన్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డు దక్కింది. న్యూఢిల్లీకి చెందిన రిఫానిమెంటో ఇంటర్నేషల్ సంస్థ దేశంలో వివిధ రంగాలలో ప్రతిభావంతులైన వారిని ఈ అవార్డుతో సత్కరిస్తోంది. ఆ సంస్థ కొరియర్ ద్వారా పంపిన ఆ అవార్డును తాను శుక్రవారం అందుకున్నట్లు వీరాస్వామి తెలిపారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కదిరిఅర్బన్, జూలై 19: పట్టణానికి చెందిన చెరువు సులేమాన్ కుమార్తె ఆసీఫా తిరుపతి పద్మావతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆ విద్యార్థి చదువుకోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఆ మొత్తాన్ని టీడీపీ నాయకులు మున్నా, అక్మల్, జావీద్ శుక్రవారం విద్యార్థిని తండ్రి సులేమాన్‌కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫారూక్, ఫిరోజ్, సాదిక్ తదితరులున్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

- సబ్‌స్టేషన్ ఎదుట మహిళల ధర్నా



సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కొత్తచెరువు, జూలై 19: మండల కేంద్రంలోని గంగమ్మగుడి కాలనీలో రెండేళ్ల నుంచి లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ మహిళలు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదన్నారు. సమస్యను పరిష్కరించాలంటూ శుక్రవారం మండల కేంద్రంలోని ట్రాన్స్ కో కార్యాలయం ఎదుట ఆ మహిళలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అధిక ఓల్టేజీ, లో ఓల్టేజీ వల్ల తమ ఇళ్లలోని ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లో ఓల్టేజీ వల్ల ఇళ్లల్లో బల్బులు వెలగడం లేదన్నారు. కనీసం వీధి లైట్లు కూడా లేకపోవడంతో విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షాకాలం కరెంటు లేకపోతే చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి ఉందని, దోమలతో రాత్రి సమయాల్లో జాగరణ చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తమ సమస్యను పరిష్కరించేవరకు ఇళ్లకు వెళ్లమని భీష్మించారు. సమస్యను ఏఈ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎల్ఐ సురేశ్ తెలపడంతో శాంతించారు.

ఘనంగా ఉట్ల పరుష

హాజరైన ఎమ్మెల్యే, మాజీ మంత్రి



ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడుతున్న కత్తివారిపల్లి యువకులు

పుట్టపర్తిరూరల్, జూలై 19: మండలంలోని నిడిమామిడి పంచాయతీ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉట్లపరుష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి యేటా మాదిరిగానే తొలి ఏకాదశి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్లపరుషలో నిడిమామిడి పంచాయతీలోని కత్తివారిపల్లి తదితర ఏడుగ్రామాల యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో తిరుపాల్ అనే యువకుడు విజేతగా నిలిచాడు. ఉత్సవం సందర్భంగా ముఖ్య అతిథులుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మా జీమంత్రి పల్లె రఘునాథరెడ్డికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. వారు ఊరేగింపుగా వెళ్లి గ్రామశివారులో ఉన్న వీరభద్రస్వామి, నిడిమామిడి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీమంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి జరగాలని దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ప్రార్థించినట్లు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి జరగాలని దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని వీరభద్రస్వామిని, నిడిమామిడమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. ఉట్ల పరుష కార్యక్రమంలో టీడీపీ రూరల్ కన్వీనర్ విజయ్‌కుమార్, నాగరాజు, మెహరాలి, సుభాష్ రవిచంద్ర, గోవిందు, శ్రీరాములు, భద్రప్పతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, సమీపగ్రామాలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు ఫిర్యాదుల వెల్లువ

పుట్టపర్తి టౌన్, జూలై 19: ఆర్టీసీ పుట్టపర్తి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలపై శుక్రవారం డిపో మేనేజర్ ఇనయతుల్లా డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి డిపో పరిధిలోని పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం తదితర మండలాలనుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇటీవల రద్దు చేసిన పుట్టపర్తి - చెన్నై బస్సును పునరుద్ధరించాని పలువురు కోరారు. పుట్టపర్తినుంచి పులివెందల, కడప, గుంత కల్లు, కసాపురం, గ్రామీణ ప్రాంతాలైన అమ్మగొండపాళ్యం, గుట్టూరు, నారసింహపల్లి తదిత ర సర్వీసులు పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. అలాగే కొత్తచెరువునుంచి ముదిగుబ్బ, కదిరికి బస్సు సర్వీసులు రెగ్యులర్‌గా తిప్పాలని కోరారు. గోరంట్లకు సాయంత్రం 4.30నుంచి 7.30 గంటల మధ్యబస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఫిర్యాదులను పరిశీలించి, అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు.

బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను తనిఖీ చేసిన డీపీఓ

ముదిగుబ్బ, జూలై19: మండల పరిధిలోని ఎనుమలవారిపల్లిలో ఉన్న బీసీ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారి శివకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యార్థుల ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎనుములవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఎనుములవారిపల్లిలో పర్యటించి డ్రైడే విషయాన్ని పరిశీలించారు. ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమణప్ప, పంచాయతీ కార్యదర్శులు, పాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు నిర్వహించకపోతే చర్యలు: డీఎల్‌డీఓ



దెబ్బతిన్న భోజనశాల ఫైబర్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సూర్యనారాయణ

తనకల్లు, జూలై 19: వసతి గృహం రికార్డులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని కదిరి డీఎల్‌డీఓ సూర్యనారాయణ సిబ్బందిని హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండలకేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం రికార్డులు, సరుకుల స్టాక్‌రూం తాళాలు మ్యాట్రిన్ షబ్బాన్ తీసుకెళ్లారని సిబ్బంది తెలుపడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆయన మ్యాట్రిన్‌కు ఫోన్ చేయగా, తాను తనకల్లుకు ఇన్‌చార్జ్‌నని కదిరిలో ఉన్నానని తెలిపారు. అనంతరం తనకల్లు వచ్చారు. అయితే రికార్డుల నిర్వాహణ, స్టాక్ గదిలో నిత్యవసరాలు లేకపోవడం పట్ల డీఎల్‌డీఓ అసహనం వ్యక్తం చేశారు. రికార్డులు సక్రంగా నిర్వహించాలని, నిత్యవసర వస్తువులు అందుబాటులో ఉంచాలని, ఇన్‌చార్జ్ అయినా రోజు మార్చి రోజు వసతి గృహానికి రావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వసతిగృహం ప్రహరీ పడిపోయిందని, రాత్రిళ్లు ఇబ్బందిగా ఉందని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా భోజనం చేసేందుకు ఫైబర్‌తో నిర్మించిన షెడ్ పడిపోయినందున ఇబ్బందిగా ఉందన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఈఓఆర్డీ క్రిష్ణమూర్తిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మలేరియాపై విద్యార్థులకు అవగాహన

నల్లమాడ, జూలై 19: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్, కస్తూర్బా పాఠశాలలను జిల్లా మలేరియా అధికారి కేసీ కుళ్లాయప్ప శుక్రవారం సందర్శించారు. మలేరియా వ్యాధిపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటగదులను పరిశీలించారు. గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు జ్వరాలు ప్రబలితే ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. ఆయనతోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీహెచ్‌ఓ రామాంజనేయులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నల్లమాడ, జూలై 19: మండలకేంద్రంలోని మసీదు వీధి, ఎస్సీకాలనీ, మారుతీ వీధి, సత్యమ్మ వీధి తదిర ప్రాంతాల్లో వైద్యసిబ్బంది శుక్రవారం పర్యటించారు. ఆయా వీధుల్లోని ఇళ్ల వద్ద ట్యాంకులు, డ్రమ్ములు, నీటి తొట్టెలను పరిశీలించి, శుభ్రం చేయించారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రి సమయంలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. దోమతెరలు తప్పకుండా వాడాలన్నారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది రామాంజనేయులు, శశిధర్, ప్రభాకర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గసభ్యులు

ధర్మవరం, జూలై 19: పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో శుక్రవారం క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, సభాధ్యక్షుడు గూడూరు మోహన్‌దాస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా వేణుగోపాలాచార్యులు, సెక్రటరీగా రమేశ్‌బాబు, కోశాధికారిగా నాగేంద్ర, ఉపా ధ్యక్షులు ప్రసాద్, పుట్లూరు నరసింహులు, జగదీశ్వర ప్రసాద్, కొత్తశ్రీరాములు, వెంకటేశ్‌కమార్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ గోసే రాధా క్రిష్ణతోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథి గా పాల్గొన్న మాజీ గవర్నర్ రమేశ్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృత పరచాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు పల్లెం వేణుగోపాల్, మెటికల కుళ్లాయప్ప, ఉట్టిశివప్రసాద్, సురేశ్, ముక్తాపురం క్రిష్ణ పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయ నిర్మాణాలు

● గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తికాని భవనాలు ● ఇబ్బందుల్లో ప్రజలు, సిబ్బంది


మెళవాయిలో పునాదులకే పరిమితం


ఆమిదాలగొందిలో ఆగిపోయిన నిర్మాణం



భక్తరహళ్ళిలో ప్రారంభానికి నోచుకోని భవనం

మడకశిర రూరల్, జూలై 19 : గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ నిర్మాణాలు అసంపూర్తిగానే ఆగిపోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పక్కా భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. అరకొరగా పూర్తయినా సౌకర్యాలు లేక ప్రజలకు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మండలవ్యాప్తంగా 18 సచివాలయాలు ఉన్నాయి. అందులో 159 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది ఇరుకు గదుల్లోనే మగ్గాల్సి వస్తోంది. పని నిమిత్త సచివాలయానికి వచ్చే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం సచివాలయాల భవన నిర్మాణాలపై గొప్పలు చెప్పుకుంది. మండలంలో 18 గ్రామ సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాలకోసం రూ.8.10 కోట్లతో అప్పట్లో పనులు చేపట్టారు. ఒక్కో సచివాలయ భవనానికి రూ.45 లక్షల నిధులను కేటాయించారు. మొదటి విడతలో నిధులు విడుదల కావడంతో కాంట్రాక్టర్లు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. రెండో విడతకు నిధులు సకాలంలో రాకపోవడంతో పనులపై ఆసక్తి చూపలేదు. లింటల్, టాప్ లెవల్ వరకు నిర్మించి ఆ పై వాటి నిర్మాణ పనులను నిలిపివేశారు. మెళవాయి గ్రామ సచివాలయం పునాదులకే పరిమితమయ్యింది. నిధుల కొరతతో ఐదేళ్లయినా భవన నిర్మాణాలు పూర్తికాలేదు. భక్తరహళ్ళి, కదిరేపల్లి సచివాలయాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో పంచాయతీ భవనాలను నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలు ఆ భవనాల్లోనే సచివాలయాలను నిర్వహిస్తువచ్చారు. నిధుల కొరతతో నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకు గదుల్లో ఇబ్బందులు..

భక్తరహళ్ళి గ్రామంలో ఒకే గదిలో సచివాలయ ఉద్యోగులు అందరూ పనిచేయాల్సి వస్తోంది. అది కూడా ఇరుగ్గా ఉంది. ఫర్నీచర్ కూడా అదే గదిలో ఉండడంతో విధుల నిర్వహణకు, ప్రజలు వచ్చిపోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని భవనాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. వాటిని ప్రారంభించి, ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుండుమలకు నారా లోకేశ్ అభినందనలు


మంత్రి నారాలోకేశ్‌తో గుండుమల

మడకశిర టౌన్, జూలై 19: నియోజకవర్గంలో టీడీపీ విజయానికి కృషి చేసినందుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామిని రాష్ట్ర విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. శుక్రవారం ఉండవల్లిలోని నారా లోకేశ్ నివాసంలో గుండుమల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కష్టసమయంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారనీ, గుర్తింపు దక్కుతుందని తెలిపినట్లు గుండుమల చెప్పారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించారు. మడకశిర అభివృద్ధికి తప్పక సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు గుండుమల తెలిపారు. అనంతరం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైనందుకు ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మానించారు. పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

ఘనంగా సామూహిక సాయి వ్రతం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, జూలై 19: గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని సత్యనారాయణపేట షిరిడీసాయి ఆలయంలో శుక్ర, శని, ఆదివారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శుక్రవారం గణపతి హోమం, సాయినాథ హోమం, అనంతరం సామూహిక సాయివ్రతాలు, మధ్యాహ్నం హారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు.

అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర(అమరాపురం), జూలై 19 : అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం అమరాపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన వహించగా, ఎంపీడీఓ భాస్కర్ సమక్షంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ఒకరినొకరు సహకరించాలన్నారు. పార్టీలకతీతంగా మడకశిరను అభివృద్ధి చేయాలన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలవల్ల నాడునేడు పనులకు సిమెంటు రాని పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. వ్యవసాయంపై వ్యవసాయాధికారి మంజునాథ్, ఆరోగ్యంపై డా.భార్గవ్, విద్యుత్‌పై ఏఈ సిద్దేశ్వర, విద్యాశాఖ ఎంఈఓ వెంకటరమణనాయక్, తాగునీటిపైన ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రత్యూష ఆయా శాఖల ప్రగతి నివేదికను వివరించారు. పలు సమస్యలను సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అమరాపురం జెడ్పీటీసీ స్వారక నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీ జయరాం, ఏపీఓ జగదీశ్, ఆర్టీసీ, వెటర్నరీ అధికారులు మండలంలోని అన్ని గ్రామ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మాజీ జెడ్పీటీసీ నరసింహమూర్తి, శివరుద్రప్ప, మండల ప్రధాన కార్యదర్శి జయరామప్ప, విశ్వేశ్వరప్ప, మాజీ ఎంపీపీ క్రిష్ణమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీవ్రతం


గౌరీవ్రతం ఆచరిస్తున్న మహిళలు

మడకశిర టౌన్, జూలై 19: ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అష్టదళ ఆషాఢ గౌరీవ్రతం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ వ్రతంలో భాగంగా లలితా సహస్రనామం, అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి: ఎంఈఓ


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

మడకశిర రూరల్, జూలై 19 : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందజేయాలని ఎంఈఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వైసీపీ తండా, చాప్లాపల్లి, సీ కోడిగేపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన ఉండాలన్నారు. డ్రాప్ అవుట్ లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు.

బాధ్యతగా పనిచేయండి: డీసీహెచ్ఎస్

మడకశిర టౌన్, జూలై 19: వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డి.సీ.హెచ్.ఎస్ తిప్పేంద్రనాయక్ సూచించారు. శుక్రవారం మడకశిర వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. గురువారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తనిఖీ సందర్భంగా చోటుచేసుకున్న వివరాలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశం అయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు డాక్టర్ శశిరేఖ, దివాకర్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన

పెనుకొండ రూరల్, జూలై 19 : రొద్దం మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో టింబక్టివ్ కలెక్టివ్ సహకారంతో ప్రతిభా దివ్యాంగుల సొసైటీ ఆధ్వర్యంలో చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు దివ్యాంగులకు చట్టాల గురించి తెలియజేశారు. మేనరిక వివాహాలపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ప్రతిభ సొసైటీ సిబ్బంది, అసోసియేట్ అక్షయ, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కొండపై ఆలయ నిర్మాణం

మంత్రి సవిత.. పలు శాఖలపై సమీక్ష


హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 19: కొండపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఆమె మాట్లాడుతూ.. ఇటీవల ఇస్కాన్ సంస్థతో సంప్రదించామనీ, వారు 108 అడుగుల లక్ష్మీనరసింహస్వామి విగ్రహం ఏర్పాటుతోపాటు ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇటీవల ప్రకటించారన్నారు. ఈ క్రమంలో పెనుకొండ కొండపై ఆలయ నిర్మానానికి అవసరమైన విద్యుత్, నీరు, తదితర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హౌసింగ్ లేఔట్లపై ఆరా

నియోజకవర్గ వ్యాప్తంగా పేదలకు కేటాయించిన హౌసింగ్ లేఔట్లపై మంత్రి సవిత ఆరాతీశారు. హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎంతమందికి ఇంటి పట్టాలు అందించారు. ఖాళీ స్థలం ఎంత ఉంది అన్న వివరాలు అందజేయాలన్నారు. సమస్యలుంటే తెలపాలనీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.


శాకంబరి అలంకరణలో ఎల్లమ్మ

శాకంబరీదేవిగా యల్లమ్మ

హిందూపురం అర్బన్, జూలై 19: పట్టణ పరిధిలోని నింకంపల్లి రోడ్డులో ఉన్న ఎల్లమ్మ దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆషాఢమాసం సందర్భంగా ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారిని శాకంబరీగా అలంకరించడం ఆనవాయితీ. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు.

తొగటవీర క్షత్రియ కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

సోమందేపల్లి, జూలై 19 : మండలంలోని లక్ష్మీనరసింహ కళ్యాణమండపంలో శుక్రవారం తొగటవీరక్షత్రియ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ దర్మకర్త ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో మాస్టర్‌వీవర్స్ సీసీ హరిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పామిశెట్టి పోలా శ్రీనివాసులు, దాసరి రామాంజి, సత్యనారాయణ ఏకగ్రీవమయ్యారు. ప్రదాన కార్యదర్శిగా రంగనగోపాల్, కోశాధికారిగా డీసీ మంజు, మీడియా కోఆర్డినేటర్‌లుగా జగదీశ్, రామాంజి, మనోహర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సీసీహరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కులస్థులకు ఏ సమస్య వచ్చినా పార్టీలకు అతీతంగా రాజీలేని పోరాటం చేసి ప్రతిఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో డీసీ అశోక్, పూజారి ఈశ్వరయ్య, కాచర్ల మల్లికార్జున, పామిశెట్టి ఈశ్వరయ్య, కుర్లపల్లి వెంకటరాముడు, నిమ్మకాయల ప్రసాద్, బండారు నాగప్ప, సీసీ రామాంజనేయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● సిబ్బందికి జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఎంఓ నాగరాజు సూచన



సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఎంఓ

పెనుకొండ రూరల్, జూలై 19 : వర్షాలు కురుస్తున్న వేళ వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఎంఓ నాగరాజు, వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీచేశారు. ఆరోగ్యకేంద్రంలో అందుతున్న సేవలపై సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఆశాడే కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ సుదర్శన్‌బాబు, వైద్య సిబ్బంది రేణుక, ప్రమీల, పుష్పవతి, ప్రభాకర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యువకుడి మృతికి టీడీపీ నేతల నివాళి


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ నిమ్మల, కిషోర్‌కుమార్ (ఫైల్)

గోరంట్ల, జూలై 19: మండలంలోని మందపల్లికి చెందిన కిషోర్‌కుమార్ గురువారం రాత్రి (26)రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంగతి తెలిసిందే. యువకుడి మృతదేహం వద్ద శుక్రవారం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు నివాళి అర్పించారు. మండలంలోని పాలసముద్రం గేట్ సమీపంలో ద్విచక్రవాహనంలో కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న కిషోర్‌కుమార్, శివారెడ్డి, భాస్కర్ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం గురువారం రాత్రి ఢీకొట్టడంతో కిషోర్ దుర్మరణం చెందాడు. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కిషోర్‌కుమార్ మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహిస్తుండగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు.. పూలమాల వేసి, నివాళి అర్పించారు. మందపల్లిలో మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. నిమ్మల చంద్రశేఖర్, సుబ్రమణ్యం, కక్కల రఘునాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్ ఉన్నారు.

జలధికి తరలిన పీర్లు

పెనుకొండ రూరల్, జూలై 19: మొహరం నేపథ్యంలో గ్రామాల్లో పీర్లు జలధికి తరలుతున్నాయి. శుక్రవారం మండలంలోని గుట్టూరు, వెంకటగిరిపాళ్యం అమ్మవారిపల్లి గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. వారం రోజులుగా భక్తులు పీర్లచావిడి ఏర్పాటుచేసి అగ్నిగుండం తవ్వారు. ఆయా గ్రామాల్లో అగ్నిగుండం ముందు చిన్నారుల నుంచి పెద్దలవరకు నిప్పులు తొక్కుతూ భక్తిని చాటుకున్నారు. వెంకటగిరిపాళ్యంలో మాజీ ఎంపీపీ కేశవయ్య, గుట్టూరులో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పీర్ల స్వాములను ఊరేగించి, జలధికి తరలించారు. భక్తులు చక్కెర, పప్పులు చదివించారు.

హిందూపురం(పరిగి) : బాబయ్యఉత్సవాల సందర్భంగా చివరి రోజు పీర్లను గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. శుక్రవారం కాలువపల్లిలో పీర్లను గ్రామమంతా ఊరేగించారు. అనంతరం బాబయ్యప్రతిమలను జయమంగళి నదివద్ద పూజలు చేసి ఉత్సవాలు ముగించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బీరలింగ, రంగనాథ్, చిక్కన్న, సతీష్, రాదాకృష్ణ, నేతులపల్లి శివశంకర్ పాల్గొన్నారు.


వెంకటగిరిపాళ్యంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


గుట్టూరులో..


సింగిరెడ్డిపల్లి వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ చేతన్ సూచన ● పలు గ్రామాల్లో పర్యటన

గోరంట్ల, జూలై 19 : ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చేతన్ సూచించారు. మండలంలోని సింగిరెడ్డిపల్లి ఫీడర్ చానల్, పూడిక తీత పనులను ఆయన తనిఖీ చేశారు. సింగిరెడ్డిపల్లి చెరువునుంచి గోరంట్ల రావికుంట చెరువుకు వెళ్లే 12వందల మీటర్ల ఫీడర్ చానల్ పూడిక తీత పనులను రూ.4.44లక్షల వ్యయంతో ఉపాధి పథకం ద్వారా చేపడుతున్నారు. ఉదయం 8గంటలకే అక్కడికి చేరుకున్న కలెక్టర్ పనులను పరిశీలించారు. కాలువపై కిలోమీటర్ మేర కలెక్టర్ నడుస్తూ పనులను పరిశీలించారు. అనంతరం గోరంట్ల సమీపంలోని పులేరు రోడ్డులో రైతు రామక్రిష్ణ రూ. రెండున్నర లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రైల్యాండ్ హర్టికల్చర్ మామిడి తోటలను సందర్శించారు. డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ శివానంద్‌నాయక్, ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, ఏపీఓ వరప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలున్నారు.

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు గ్రామంలో జరుగుతున్న అవెన్యూ ప్లాంటేషన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. మొక్కలు తవ్వడానికి తీసిన గుంతలను పరిశీలించారు. మొక్కలు నాటేసి వాటి గురించి పట్టించుకోకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ రామ్‌కుమార్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

లేపాక్షి : సకాలంలో ఉపాధి కూలి అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే కూలి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధికూలీలు జిల్లా కలెక్టర్ చేతన్‌కు మొరపెట్టుకున్నారు. శుక్రవారం లేపాక్షి ఎంపీడీఓ కార్యాలయం వెనుక మామిడితోటలో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాటమంతి కలిపారు. ఈ సందర్భంగా కూలీలు వారి ఆవేదనను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామన్నారు. ఆయన స్పందిస్తూ సకాలంలో కూలీలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీఓ శివానందనాయక్, ఏపీఓ జ్యోతి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

పెనుకొండ, జూలై 19 : స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదిశేషరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యూ కనెక్ట్, వికేర్ సంస్థ ల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ 50శాతం మార్కులతో పాసై 26సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఉదయం 10గంటలకు అభ్యర్థులు జిరాక్స్ పత్రాలు, బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9014219363, 9908830835నందు సంప్రదించాలన్నారు.

రేపు గిరి ప్రదక్షిణ

హిందూపురం అర్బన్, జూలై 19: పట్టణానికే తలమానికమైన మహిమాన్విత దేవాలయం గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం గిరి ప్రదక్షిణ చేపట్టనున్నట్లు ఆలయ అర్చకుడు గోవింద శర్మ, ఈఓ నాగేంద్ర తెలిపారు. గిరి ప్రదక్షిణ చేస్తే సర్వపాపాలు పోవడమే కాకుండా కోరిక కోర్కెలు తీరుతాయని ప్రతీతి అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

రేపు విద్యార్థులతో చర్చాగోష్టి

హిందూపురం అర్బన్, జూలై 19: సైన్స్, సామాజిక సమస్యలపై స్థానిక ఎస్ఎస్‌పీఆర్ మహిళా కళాశాల విద్యార్థులతో చర్చాగోష్టి నిర్వహించనున్నట్లు జేవీవీ ప్రధాన కార్యదర్శి డా. ఈటీ రామ్మూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం కళాశాలలో జెవివి ప్లీనరీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మహేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఆదిశేషులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యక్రమంపై చర్చ, జోనల్ కమిటీ మార్పు ఉంటుందన్నారు.

మునుపటి వేళల్లోనే బస్సు నడపాలి

అగళి, జూలై 19 : ఏపీఎస్ఆర్టీసీ శిర బస్సును పాత సమయానికే నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో ఉదయం శిరలో 5గంటలకు బయలుదేరే బస్సు హిందూపురం7-45 నిమిషాలకు చేరుకునేదని దీంతో రైతులు, విద్యార్థులు సౌకర్యాంగా ఉండేది. అయితే ప్రస్తుతం ఈ బస్సు ఉదయం శిరలో6గంటలకు బయలుదేరి మడకశిరకు 8-30కు వస్తోందని హిందూపురం, పుట్టపర్తి, అనంతపురం వెళ్లాలంటే ఆలస్యం అవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవలే రొళ్ల మండల సర్వసభ్యసమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆయా మండలాల ప్రజలు తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పాత సమయానికే బస్సు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టణ సుందరీకరణ పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూలై 19: మంత్రి సవిత ఆదేశాల మేరకు పట్టణ సుందరీకరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. రోడ్డు డివైడర్ పనులను టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15లక్షలతో పట్టణంలోని దర్గా సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు డివైడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటుచేసి బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. పట్టణంలో పరిశుభ్రత పనులు, అభివృద్ధి పనులను శరవేగంగా చేయాలని మంత్రి సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, వడ్డె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రత అందరి బాధ్యత: ఐసీడీఎస్ పీడీ

మడకశిర రూరల్, జూలై 19 : బాలికల భద్రత అందరి బాధ్యత అని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరిపేర్కొన్నారు. మండలంలో హరేసముద్రం ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించేవారు శిక్షార్హులు అన్నారు. కార్యక్రమంలో నీలకంఠాపురం పీహెచ్ డాక్టర్ భార్గవి, ఆర్డీటీ రిజినల్ డైరెక్టర్ మల్లికార్జున, టీమ్ టీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి, ప్రధానోపాధ్యాయులు సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

హిందూపురం(పరిగి), జూలై 19 : మండలంలోని నేతులపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు హిందూపురం పట్టణానికి చెందిన ఈశ్వర్ జ్యువెలర్స్ వ్యవస్థాపకులు శ్రీహర్ష, శ్రీవర్ష దంపతులు తమ కుమార్తె శ్రీఆద్య పేరిట విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి లక్ష్మీదేవి, ఎంఈఓ శేషాచలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహంతేష్, శాసనకోట ప్రధానోపాధ్యాయులు ఆనంద్ రాజు పాల్గొన్నారు. విద్యాశాఖాధికారులు దాతలను అభినందించారు.


దుస్తులతో విద్యార్థులు